క్లుప్తంగా

ఆహో క్యాంటీన్ ప్రారంభం



ఆహో క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: స్థానిక పార్కు సెంటర్‌లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆహో క్యాంటీన్‌ను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి ప్రారంభించారు. వైఎస్సార్ చేయూత, ఆసరా ఆర్థిక సహకారంతో స్వయం సహాయక సంఘాల సభ్యులు ఈ క్యాంటీన్‌ను నిర్వహిస్తాయని ఆమె తెలిపారు. ఉదయం అల్పాహారం రూ.10, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో భోజనం రూ.40కి లభిస్తుందన్నారు. మెప్మా సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



గౌరంపేటలో రోగులకు సూచనలిస్తున్న వైద్యాధికారి సౌమ్యశ్రీ

శంఖవరం: డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పి.మల్లాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సౌమ్యశ్రీ సూచించారు. గౌరంపేటలో ప్రజలకు శనివారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎడీస్ దోమ కుట్టడం వల్ల డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూట కుడుతుందన్నారు. డెంగీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒళ్లు నొప్పులు, కాళ్లు లాగడం, వాంతులు, చలి జ్వరం, పంటి చిగుళ్ల నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. పలువురు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ



ఏలేశ్వరంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు శనివారం పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి జన్మదినాన్ని పురస్కరించుకుని ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల బాబ్జీ ఆధ్వర్యంలో మండల వైద్యాధికారి శైలజ చేతుల మీదుగా రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. అనంతరం చిన్నింపేట శివారు వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనకదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరి తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి జన్మ నక్షత్రం 'మూల' సందర్భంగా శనివారం అమ్మవారికి చండీ హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమ గుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు సంతోష్, గంగాధరబట్ల శర్మ, ప్రయాగ రాంబాబు, నర్సింహమూర్తి, చెల్లపిళ్ల ప్రసాద్, దేవులపల్లి ప్రకాష్ తదితరులు హోమం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తొండంగి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు తొండంగి ఏఎస్సై రాయవరపు వెంకటరమణ శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. యు.కొత్తపల్లి మండలం పొన్నాడ గ్రామానికి చెందిన షేక్ లాల్ జానీ తుని చికెన్ షాపులో పని చేస్తుంటాడు. ఈ నెల 23న పొన్నాడ నుంచి తుని వెళ్లేందుకు బైక్‌పై బయలు దేరాడు. పెరుమాళ్లపురం పంచాయతీ గడ్డిపేట వద్ద బీచ్‌రోడ్డుపై విద్యుత్ వైరు తగిలి బైక్ అదుపు తప్పి పడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. జానీ భార్య షేక్ గౌసియా బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై రమణ వివరించారు. కాగా మృతునికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

జ్యోతుల నెహ్రూను పరామర్శించిన ముద్రగడ

జగ్గంపేట: సోదరి వియోగంతో బాధపడుతున్న రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూను శనివారం మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం పరామర్శించారు. నెహ్రూ సోదరి తోట నాగలక్ష్మి ఈ నెల 22న మృతి చెందారు. దీంతో ముద్రగడ పద్మనాభం ఇర్రిపాకలో నెహ్రూ, అతని కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.

హైక్లాస్ చదువులు

- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- నాడు–నేడులో రూ.30 కోట్లతో వసతులు
- మెరుగైన ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులు



నాడు-నేడులో అభివృద్ధి చేసిన తుని బ్యాంక్ కాలనీ మున్సిపల్ హైస్కూల్

తుని రూరల్: ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. పేదలకు వెలకట్టలేని ఆస్తి విద్యేనని భావించిన ప్రభుత్వం సర్కారీ స్కూళ్లలో మెరుగైన సదుపాయాలు కల్పించడం సత్ఫలితాలను ఇస్తోంది. గత ప్రభుత్వాలు ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహించి విద్యను ఖరీదైనదిగా మార్చేశారు. అందుకు భిన్నంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యా విధానంలో పలు విప్లవాత్మకమైన మార్పులు చేసింది. సర్కారీ స్కూళ్లలో ఆంగ్లమాధ్యమాన్ని ప్రవేశపెట్టడం, మౌలిక వసతులు కల్పించడం, పాఠశాలల్లో విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులను కేటాయించడం, జగనన్న విద్యా కానుక పేరుతో యూనిఫాం, షూ, సాక్సులు, బెల్టు, బ్యాగ్, రాత, పాఠ్య పుస్తకాలు, డిక్షనరీ అందిచడంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్‌కు దీటుగా ఫలితాలు సాధిస్తున్నారు.

డిజిటల్ బోధన

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో డిజిటల్ విద్యను బోధిస్తున్నారు. పిల్లలను బడికి పంపించిన తల్లులకు ఏటా రూ.15 వేలు చొప్పున అమ్మఒడి పథకంలో అందిస్తోంది ప్రభుత్వం. మన బడి నాడు-నేడులో పాఠశాలలను అభివృద్ధి చేసింది. అదనపు గదులు, మరుగుదొడ్లు నిర్మించింది. మినరల్ వాటర్, సైన్స్ ల్యాబ్‌లు, రుచికరమైన మధ్యాహ్న భోజనం, రాగిజావ, చిక్కీలతో పౌష్టికాహారాన్ని అందిచడంతో విద్యార్థులు క్రమం తప్పకుండా స్కూల్‌కు వెళుతున్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు.

మండలంలో వివరాలు

తుని మండలంలోని 24 పంచాయతీల పరిధిలో మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్, ప్రభుత్వ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, కేజీబీవీ పాఠశాలు 89 ఉన్నాయి. వీటిల్లో ఒకటి నుంచి పది తరగతులు చదువు ఉన్న విద్యార్థులు 11,414 మందికి 493 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఫేజ్-1లో రూ.6.40 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశారు. ఫేజ్-2లో రూ.23.56 కోట్లతో అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

తుని మండలంలో పాఠశాలల వివరాలు

ఎంపీపీ స్కూళ్లు	62
యూపీ స్కూళ్లు	7
హైస్కూళ్లు	14
ఎస్సీ గురుకులాలు	2
బీసీ గురుకులాలు	2
ఏపీ మోడల్ స్కూల్	1
కేజీబీవీ	1
మొత్తం పాఠశాలలు	89
విద్యార్థులు	11414
ఉపాధ్యాయులు	493



కస్తూర్బా గాంధీ విద్యాలయం

ఇద్దరు పిల్లలూ చదువుతున్నారు



మాకు ఇద్దరు ఆడపిల్లలు. ఇద్దరినీ ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తున్నాను. నక్షత్ర నాలుగో తరగతి, చిన్న పాప రెండో తరగతి చదువుతున్నారు. అమ్మ ఒడి పథకంలో రూ.15 వేలు చొప్పున అందుతోంది. ఇద్దరికీ పాఠశాలలోనే యూనిఫాం, పుస్తకాలు, జగనన్న విద్యా కానుక ఇచ్చారు. ప్రభుత్వ సహకారంతో ఏ ఇబ్బంది లేకుండా ఇద్దరు పిల్లలు చదువుకుంటున్నారు. – కామిరెడ్డి రాణి, విద్యార్థినుల తల్లి, అశోక్ నగర్

'నాడు–నేడు'తో మౌలిక వసతులు



మా హైస్కూల్‌లో 504 మంది విద్యార్థులు ఉన్నారు. నాడు–నేడు ఫేజ్–1లో మంజూరైన రూ.52 లక్షలతో మౌలిక వసతులు సమకూర్చాం. పాఠశాలను ఆధునీకరించాం. ఫేజ్–2లో రూ.96 లక్షలు మంజూరు కాగా ఎనిమిది అదనపు గదులు నిర్మిస్తున్నాం. రెండు నెలల్లో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తాం. – పైల వెంకటరమణ, ఎస్ఎంసీ చైర్మన్, జెడ్పీ హైస్కూల్, డి.పోలవరం

చురుగ్గా రెండో విడత పనులు



మనబడి నాడు–నేడు మొదటి, రెండో విడతల్లో మండలానికి రూ.30 కోట్లు మంజూరయ్యాయి. మొదట విడత పనులు పూర్తవగా రెండు విడత పనులు జరుగుతున్నాయి. ఈ నిధులతో అదనపు గదులు, మరుగుదొడ్లు, ప్రహరీలు, బెంచీలు, కుర్చీలు, గ్రీన్ బోర్డులు ఏర్పాటు చేశాం. పథకాలన్నీ విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకున్నాం. – పరవాడ గీతాదేవి, ఎంఈఓ, తుని

రెండు రోజుల్లో వైఎస్సార్ సీపీ మండల కమిటీల ఏర్పాటు



జగ్గంపేటలో వైఎస్సార్ సేవాదళ్ రీజనల్ కో ఆర్డినేటర్‌కు స్వాగతం పలుకుతున్న నేతలు

జగ్గంపేట: మరో రెండు రోజుల్లో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు కమిటీలను ఏర్పాటు చేస్తామని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సేవాదళ్ రీజనల్ కో ఆర్డినేటర్ చిన్నిమిల్లి వెంకట రాయుడు తెలిపారు. స్థానిక స్వామివివేకనంద స్కూల్‌లో శనివారం ఆయన వైఎస్సార్ సీపీ మండల సేవాదళ్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. మరో మూడు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, సేవాదళ్ కన్వీనర్లు పాల్గొన్నారు.

నేడు అల్లిపూడిలో గడపగడపకూ మన ప్రభుత్వం

కోటనందూరు: మండలంలోని అల్లిపూడిలో ఆదివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీపీ లగుడు శ్రీనివాసు శనివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వనదుర్గ అమ్మవారి జాతర ప్రారంభం



బాలా త్రిపురసుందరి అలంకరణలో వనదుర్గ అమ్మవారు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారి శ్రావణ మాస జాతర మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 9 గంటలకు పండితులు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం నిర్వహించి జాతర మహోత్సవాలకు అంకురార్పణ చేశారు. నవధాన్యాలతో మండపారాధన, కలశస్థాపన చేశారు. 44 మంది రుత్విక్కులు నవగ్రహజపాలు, శ్రీచక్రార్చన, పురుష, శ్రీసూక్త పారాయణలు, మూలమంత్ర జపాలు, సూర్యనమస్కారాలు, సప్తశతీ పారాయణలు, మూలమంత్ర జపాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకూ అమ్మవారికి రుత్విక్కులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ నెల 31 వరకూ ఈ జాతర మహోత్సవాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

ఘనంగా ముంగర్లమ్మ జాతర

కిర్లంపూడి: వేలంకలో వేంచేసిన ముంగర్లమ్మ అమ్మవారి జాతర శనివారం ఘనంగా జరిగింది. అమ్మవారి జాతరను పురస్కరించుకుని పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బాణసంచా కాల్పులు, గలగల నృత్యాల నడుమ అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. స్థానిక, పరసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రత్నగిరిపై అపరాజిత అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



అపరాజిత అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై రామాలయం పక్కన శమీవృక్షం (జమ్మి చెట్టు) వద్ద శనివారం అపరాజిత అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుడు గొల్లపల్లి ఘనపాఠి మాట్లాడుతూ కురుక్షేత్రం యుద్ధానికి ముందు పాండవులు తమ ఆయుదాలను శమీ వృక్షం మీద దాచి ఉంచారన్నారు. శమీ వృక్షం వద్ద అపరాజిత అమ్మవారు కొలువై ఉంటారని, ఆ అమ్మవారిని ప్రార్థించి పాండవులు కురుక్షేత్రంలో విజయం సాధించారని తెలిపారు. ప్రతి కార్యానికి ముందు జమ్మిచెట్టుతో పాటు అపరాజిత అమ్మవారికి ప్రదక్షణ చేసి దర్శిస్తే విజయం సిద్ధిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, అర్చకులు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, వ్రతపురోహితులు నాగాభట్ల రవిశర్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం



గిడజాంలో ఎమ్మెల్యే పర్వత ప్రసాద్‌ను గజమాలతో సత్కరిస్తున్న గ్రామస్తులు

రౌతులపూడి: ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. గిడజాంలో క్రీస్తు సేవకులు బండారు బైరాగి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన చర్చిను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు భక్తిభావం, సేవాదృక్పథంతో మెలగాలన్నారు. తొలుత చర్చి సేవకులు, గ్రామ పెద్దలతో కలసి బైరాగి దంపతులు ఎమ్మెల్యే పర్వతను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

కుండపోత వాన



గోపాలపట్నంలో పొలాన్ని ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న దృశ్యం

తొండంగి: మండల వ్యాప్తంగా శనివారం కుండపోత వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా వర్షాలు పడకపోవడంతో ఖరీఫ్ సాగు చేసిన రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురుచూశారు. శనివారం తెల్లవారుజాము నుంచి దాదాపుగా మూడు గంటలపాటు కుండపోత వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పొలాల్లో వర్షంనీరు చేరడంతో ఎండుతున్న పంటలకు ఊపిరి పోసినట్టు అయ్యిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడడంతో పంపా, పీబీసీ ఆయకట్టు ప్రాంతంలో వ్యవసాయ పనులు ముమ్మరం కానున్నాయి.

దాతల సేవలు ప్రశంసనీయం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్



మహిళలకు చీరలు, ప్రసాదం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: దాతల సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. స్థానిక వేంకటేశ్వరస్వామి (బాలాజీచౌక్) ఆలయ ధర్మకర్త గోపు వెంకట్రావు, గోపు శ్రీనివాసరావు దంపతులు శనివారం గోపు పాపారావు జ్ఞాపకార్థం బాలాజీ చౌక్ వద్ద పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ చేతుల మీదుగా సుమారు 600 మంది మహిళలకు చీరలు, తిరుపతి లడ్డూ, నిమ్మమొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోపు వెంకట్రావు, గోపు శ్రీనివాసరావు దంపతులు పేదలకు సేవాకార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. దాతలు సేవలను మరింత విస్తృతం చేయాలని కోరారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, శిడగం త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



తునిలో కొబ్బరి, జామ మొక్కలను పంపిణీ చేస్తున్న చైర్మన్ విజయకుమార్

తుని/తుని రూరల్: పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యకరమైన వాతావరణానికి మొక్కలను విరివిగా పెంచాలని అనకాపల్లి జిల్లా సబ్బవరానికి చెందిన గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ చైర్మన్ పువ్వల విజయకుమార్ అన్నారు. తుని రాజా జూనియర్ కళాశాల మైదానంలో శనివారం కొబ్బరి, జామ మొక్కల పంపిణీ కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇందుకు అవసరమైన లక్ష మొక్కలను తమ ట్రస్ట్ ఉచితంగా అందిస్తుందన్నారు. దీనిలో భాగంగా మొదటి విడతగా 10 వేల మొక్కలను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పప్పు వెంకటరమణ, స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్లు విజయబాబు, సీహెచ్ విజయకుమార్, అర్జునరావు, విజయ్ రత్నం, పప్పు విజయ్, సోషల్ వర్కర్లు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ

రూ.92 వేల రికవరీకి ఆదేశం



గోకవరంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

గోకవరం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ జరిగింది. ఎంపీడీఓ పద్మజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీలో డ్వామా పీడీ పి.జగదాంబ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు ఉపాధి హామీ ద్వారా రూ.12.90 కోట్లతో వంద రోజుల పనిదినాలు కల్పించిన 771 పనులకు తనిఖీ నిర్వహించారు. వీటిలో ఉపాధి హామీ ద్వారా 712 పనులు, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో 42 పనులు, సర్వశిక్ష అభియాన్ ద్వారా ఆరు, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 11 మినీ గోకులం పనులకు సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఆయా పనుల వద్ద పనులకు సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో రూ.92 వేలు రికవరీకి ఆదేశంచారు. గంగంపాలెం సింహాద్రి చెరువు మస్టర్లలో అవకతవకలు జరిగాయని గ్రామస్తులు, ఉపాధి వేతనదారులు డ్వామా పీడీ ఎదుట ఆరోపించారు. దీనిపై విచారణకు డ్వామా పీడీ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు, ఎస్ఆర్పీ బి.తులసీనాయక్, ఏపీఓ పీఎస్ అప్పలరాజు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నేతలపై పోలీసులకు ఫిర్యాదు



శంఖవరంలో ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న సోషల్ మీడియా ప్రతినిధులు

శంఖవరం: ప్రజలను రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేస్తున్న టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ దడాల బాబ్జీ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బహిరంగ సభల్లో రాష్ట్రంలో అల్లర్లు సృష్టించే విధంగా మాట్లాడుతున్న నారా లోకేష్, చంద్రబాబునాయుడు, అచ్చెన్నాయుడులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సోషల్ మీడియా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మదర్ థెరిసా జయంతి



హంసవరంలో మదర్ థెరిసా విగ్రహానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ మేరీఅవినాష్



తునిలో మదర్ థెరిసా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

ఏలేశ్వరం: విశ్వమాతృమూర్తి మదర్ థెరిసా జయంతి వేడుకలు పట్టణంలో శనివారం ఘనంగా జరిగాయి. వైఎస్సార్ సీపీ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో స్థానిక స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూర్యకుమార్ మాట్లాడుతూ పేదలకు మదర్ థెరిసా చేసిన సేవలు అపూర్వమన్నారు. మదర్‌థెరిసాను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి శైలజ, వైఎస్సార్ సీపీ నాయకులు కోరాడ ప్రసాద్, పైల విజయ్ కుమార్, జువ్విన వీర్రాజు, జామి ఆదినారాయణ, చందక కిరణ్, దాకమర్రి లోవరాజు, సిరపు కృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిసాకు ఘన నివాళులు

తుని రూరల్: మండలంలోని హంసవరంలో శనివారం మదర్ థెరిసా జయంతి నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రాయి మేరీఅవినాష్ ఆధ్వర్యంలో మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తుని పట్టణం కొండవారపేటలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాము ఆధ్వర్యంలో మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు.

ప్రత్తిపాడు: స్థానిక మినర్వా విద్యాసంస్థల ఆవరణలో శనివారం నోబెల్ బహుమతి గ్రహీత మదర్ థెరిసా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం మల్లికార్జునరావు, పాఠశాల ఇన్‌చార్జి ఎం.లక్ష్మణ్‌కుమార్ మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేదలకు ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని తామరాడలో శనివారం మదర్ థెరిసా జయంతి వేడుకలు నిర్వహించారు. మేమున్నాం ట్రస్ట్ సభ్యులు మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక పాఠశాలలో విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోకాడ రాజా, మేమున్నాం ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

తుని: స్థానిక గ్రంథాలయ ఆవరణలో ఎస్ఎఫ్ఐ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం మదర్ థెరిసా జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత విద్యార్థులు మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.రాము మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని నమ్మి తన జీవితం మొత్తం ప్రజా సేవకే అంకితం చేసిన మాతృమూర్తి మదర్ థెరిసా అన్నారు. నేటి విద్యార్థులు మదర్ థెరిసా జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని సమాజ సేవ చేయాలని పిలుపునిచ్చారు. నేను సైతం-మేము సైతం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు గొల్లపల్లి వీరబాబు, జెడ్ఆర్‌యూ సీసీ మెంబర్ బోడపాటి శ్రీను, లైబ్రరియన్ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా రథయాత్ర



గండేపల్లిలో సత్యరథంలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో శనివారం అన్నవరం సత్యనారాయణస్వామి రథయాత్ర శోభాయమానంగా జరిగింది. అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో ధర్మప్రచార మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామంలోని శ్రీరామగిరి కొండపై సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం సాయంత్రం గ్రామంలో రథయాత్ర నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి రథాన్ని దర్శించుకున్నారు. రథయాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అన్నవరం దేవస్థానం సూపరింటిండెంట్ కంచి మూర్తి, అర్చకులు శ్రీనివాసాచార్యులు, గ్రామ పెద్దలు శరకణం మురళీకృష్ణ, అబ్బిరెడ్డి కృష్ణ, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో హిందూ ధర్మ ప్రచారం

గండేపల్లి: మండల పరిధిలోని గ్రామాల్లో అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో శనివారం హిందూధర్మ ప్రచారం నిర్వహించారు. ఉదయం అన్నవరంలో ప్రారంభమైన హిందూధర్మ ప్రచార రథం ప్రత్తిపాడు, జగ్గంపేట మీదుగా గండేపల్లి చేరింది. ఇక్కడ ప్రజలకు అర్చకులు సత్యనారాయస్వామి వ్రత విశిష్టత, హిందూధర్మ ప్రాముఖ్యతను వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు ప్రచార రథాన్ని దర్శించుకున్నారు.

5న మండల సమావేశం

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సెప్టెంబర్ 5న మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు శనివారం తెలిపారు. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అధ్యక్షతన మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చిస్తారన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.